క్లుప్తంగా

అర్హులకు ఇళ్ల స్థలాలు

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ తెలిపారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు గాను గుమ్మడిదల గ్రామంలో భూమి చదును చేసే పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, సర్వేయర్ రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అదేవిధంగా విద్యార్థి బన్ని జిల్లాస్థాయి కుస్తీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. త్వరలో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో బన్ని పాల్గొంటాడని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

జానయ్యకు డాక్టరేట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత విభాగం అధ్యాపకులుగా పనిచేస్తున్న సీహెచ్. జానయ్యకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్, అధ్యాపకుల బృందం ఆయనను ఘనంగా సన్మానించింది. గణిత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏ న్యూమారికల్ స్టడీ అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళి, భిక్షపతి, మోహన్, వరలక్ష్మి జ్యోతి, నరసింహులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి

హత్నూర(సంగారెడ్డి): విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటూ చదువుల్లో రాణించాలని ఎస్‌ఐ సుభాష్ అన్నారు. గురువారం హత్నూర మండలంలోని తురకల ఖానాపూర్ శివారులో రత్నాపూరి విద్యాసంస్థలు ప్రథమ ద్వితీయ, తృతీయ విద్యార్థులకు ర్యాగింగ్ భూతంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా కలిసి మెలిసిగా ఉండాలని సూచించారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



వట్‌పల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

వట్‌పల్లి(అందోల్): జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అని టీయూడబ్ల్యూజే-143 అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల పవన్ అభివర్ణించారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని కోరుతూ గురువారం జోగిపేట తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. టీయూడబ్ల్యూజే-143 జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, టీఈఎంజేయూ అందోల్ అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్, భగత్, సంతోష్‌కుమార్, చంద్రశేఖర్, శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల సాక్షి విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ రాజిరెడ్డికి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మల్‌రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, విఠల్, శ్రీకాంత్, రవి, ఖలీం ఉన్నారు.



వర్షంలో గొడుగులు పట్టుకొని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

వర్షం సైతం లెక్కచేయక..

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. గురువారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకొని సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. – నారాయణఖేడ్



ముస్తాబైన రాయిపల్లి సుఫీషా రోషన్ అలీ దర్గా

ఉత్సవాలకు ముస్తాబు

మండల పరిధిలోని రాయిపల్లి సుఫీషా రోషన్‌అలీ దర్గా 38వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. 23న గంధాలు తీయడం, ఖవ్వాలి, 24న దీపారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 25న తీర్థ ప్రసాదాలను అందజేస్తామని దర్గా పీఠాధిపతి అక్రమ్‌అలీ ఉర్ఫ్ రహమత్ హుస్సేన్ ఖాద్రి తెలిపారు.

గొప్ప గాంధేయవాది లక్ష్మణ్ బాపూజీ



పటాన్‌చెరు: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సంగారెడ్డి మున్సిపాలిటీ: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: తొలి, మలిదశ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కొనియాడారు. గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, పద్మశాలి సంఘం చైర్మన్ రాజమల్లయ్య, అధ్యక్షులు రమేష్, రఘు రాములు, సోమ శ్రీను పాల్గొన్నారు.

నివాళి

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని ఎఫ్‌ఎర్‌ఎస్ గేటు ఎదుట ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ గురువారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్

మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.



మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

99498 49479

అధికారులు ఎక్కువ.. సభ్యులు తక్కువ

- మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజా సమస్యలపై ప్రశ్నించే సభ్యులు తక్కువ సంఖ్యలో హాజరు కావడంతో సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన న్యాల్‌కల్ మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి వైస్ ఎంపీపీ గౌసొద్దీన్‌తో పాటు మిర్జాపూర్(బి), హద్నూర్, ముంగి, చీకూర్తి, డప్పూర్ గ్రామాల ఎంపీటీసీలు, మెటల్‌కుంట, మామిడ్గి, చీకూర్తి, ఖలీల్‌పూర్ గ్రామాల సర్పంచ్‌లు హాజరయ్యారు. సభ్యులు చాలా మంది గైర్హాజరు కావడంతో సభ ఖాళీగా మారింది. అనంతరం సభ్యులు పలుసమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు సరైన వైద్యం అందడంలేదని, ఆస్పత్రిలో టెస్టులు చేయకుండా రోగులను ప్రైవేట్‌కు రెఫర్ చేస్తున్నారని మెటల్‌కుంట సర్పంచ్ పీటర్‌రాజు మండిపడ్డారు. గతంలో గ్రామాల్లో ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరాకు సంబంధించి రూ.9 కోట్లు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్ తెలిపారు. రాజోల, మల్గి, కల్బేమల్, మెటల్‌కుంట, రేజింతల్ తదితర గ్రామాలకు విద్యుత్ స్తంభాలు మంజూరైనట్లు విద్యుత్‌శాఖ ఏఈ అర్జున్ తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీకీ ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ మారుతి రాథోడ్ తెలుపగా, ఇప్పటివరకు రైతుబంధు ద్వారా 18,700 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు ఏఓ లావణ్య తెలిపారు. అనంతరం సభకు హాజరైన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం మాట్లాడుతూ.. మండల సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని, కింది స్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపిస్తే ప్రయోజనం ఉండదని సూచించారు. త్వరలో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున అభివృద్ధి పనులను వేగిరం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సభ్యులు, అధికారులు ఆయనను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం

సెక్టోరల్ అధికారులకు శిక్షణ

నారాయణఖేడ్: ఎన్నికల ఏర్పాటు ప్రక్రియను పురస్కరించుకొని నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సెక్టోరల్ అధికారులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ దేవదాస్, ఖేడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఆర్‌ఐ శ్యాంరావు పటేల్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి



ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన జహీరాబాద్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులను గురువారం క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జహీరాబాద్‌లో ముదిరాజ్ భవన్ కోసం స్థలం కేటాయించి నిధులను విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మొహినొద్దీన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మధుసూదన్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రాములు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మాద్రి లక్ష్మణ్, జహీరాబాద్ మండల అధ్యక్షుడు గీరబోని రవి, ఉపాధ్యక్షులు సంగమేష్ బుచ్చినెల్లి, కోహీర్ మండల అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు రాము, రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ గ్రామానికి చెందిన శామప్ప కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు.

సెల్ఫీ విత్ గణేశ్



సంగారెడ్డి ఆదిత్యనగర్‌లో గణేశ్‌తో యువకులు



సంగారెడ్డి తులసి అపార్ట్‌మెంట్‌లో ప్రతిష్ఠించిన గణేశ్‌తో మధుశేఖర్ మిత్ర బృందం



ఝరాసంఘం: గణేశ్‌తో యూత్ సభ్యులు



జోగిపేటలో గణేశ్‌తో వివేకానంద యూత్ సభ్యులు

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

నారాయణఖేడ్: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన భూమయ్యకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు యాదవ్, రాజు, పండరి పాల్గొన్నారు.

◆ **అన్ని వర్గాల సంక్షేమానికి కృషి**

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మండలంలోని అనంతారం, కానుకుంట గ్రామాల లబ్ధిదారులకు గురువారం గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు ఆటో సౌకర్యం**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మొల్లగూడెం గ్రామం నుంచి కానుకుంటకు విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తుంటారు. విద్యార్థుల కోసం ఆటో సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఆన్‌ఆర్ యువసేన నాయకులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధును కోరారు. దీంతో స్పందించి ఆయన విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించారు. ఈ మేరకు నీలం మధుకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు**

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టిన ఘటనలో బస్‌డ్రైవర్, కండక్టర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని నవపాన్ చౌరస్తాలో యూటర్న్ తీసుకుంటున్న లారీని సంగారెడ్డి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న రాణిగంజ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ రవీందర్, కండక్టర్ సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

◆ **వ్యక్తికి జైలు శిక్ష**

జహీరాబాద్ టౌన్: మద్యం తాగి మోటారు బైక్ నడిపిన వ్యక్తికి న్యాయమూర్తి జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్‌కు చెందిన గోపాల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం చిరాగ్‌పల్లి పోలీసులు మన్నాపూర్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. మద్యం తాగిన గోపాల్ బైక్‌పై జహీరాబాద్ నుంచి మన్నాపూర్‌కు వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కోర్టులో రిమాండ్ చేయగా న్యాయమూర్తి గోపాల్‌కు రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ **విగ్రహావిష్కరణ**



ఝరాసంగం(జహీరాబాద్): మహారాష్ట్రలో జగద్గురు ఆది శంకరాచార్యుల 108 అడుగుల విగ్రహావిష్కరణలో దస్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వరస్వామి పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ వేడుకలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులతో కలిసి వేడుకలోల్లో పాల్గొన్నట్లు సిద్దేశ్వరస్వామి తెలిపారు.

◆ **లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ**

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని 8వ వార్డులో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ను బీఆర్‌ఎస్ నేత చింతా ప్రభాకర్ గురువారం పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆ **పంట రుణాలు ఇవ్వాలి**

సంగారెడ్డి అర్బన్: అసైన్‌మెంట్ భూముల పట్టా పొంది వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు క్రాప్‌లోన్లు అందజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లీడ్ బ్యాంకు ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ రఘుకు వినతిపత్రం అందజేశారు.

◆ **మహిళను ఢీకొట్టిన కారు**

పటాన్‌చెరు టౌన్: మహిళను కారు ఢీకొట్టిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక నుంచి ప్రనీష్ అతడి భార్య వీరమణి కలిసి బతుకుదెరువు కోసం వచ్చి పీఎస్‌ఆర్ కాలనీకి సమీపంలో రోడ్డు పక్కన గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19 తేదీన గుడిసెలో నుంచి బయటకు వస్తున్న క్రమంలో వీరమణిని పీఎస్‌ఆర్ కాలనీ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వీరమణికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరమణి భర్త ప్రనిష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.